లేఖా సాహిత్యం

చెల్లెతల్లీ,

ఎలా వున్నావూ? ఏం చేస్తున్నావూ? కొత్త గృహిణిగా నీ బాధ్యతలతో తలమునకలవుతున్నావా? వెనక్కి తిరిగి చూస్తే అపుడే మా చిన్నతల్లి, వరాల మూట పెళ్ళి జరిగి నెల గడిచిపోయింది.

గోడలకి వేసిన కొత్త సున్నం వాసనలు, గుమ్మాల ఎండిపోతున్న మామిడాకు తోరణాల గలగలలు, ఇవన్నీ చూసేవారికి ఈ ఇంట్లో ఏదో శుభకార్యం జరిగినట్లు తెలియచేస్తాయేమోగాని, నాకు మాత్రం అవన్నీ నిన్ను నా నుంచి దూరం చేసిన కరకు సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.

నువ్వు లేని ఈ నెల రోజులు ఈ ఇల్లు ఎలా వుందని చెప్పను ? ఎప్పుడూ వినిపించే కిలకిల నవ్వులు, పరుగులు పెట్టే గజ్జెల పట్టీల కాళ్ళ చప్పుళ్ళు ఇవన్నీ ఏవి? నామనస్సుకి అంతా శూన్యంగా వుంది. బహుశా అది నా భ్రమేమో! నాతోపాటు ఈ ఇంటి గోడలు, కిటికీలు, నీ

వనితామణి

బుక్స్ పెట్టుకొనే బల్ల, నీ బెడ్, ఒక టేమిటి అన్నీ దిగులుగా కనిపిస్తున్నాయి!

ప్రొద్దున్నే లేవగానే పేపర్ కోసం మీ చిలిపి తగవులు లేక వెల్లి కూడా చిన్నబోయింది. "అమ్మా! అక్క లేకపోయేసరికి ఇల్లంతా ఇంత నిశ్శబ్దంగా అయిపోయిందేమిటి?" అంటూ నన్ను అడుగుతుంటే, నేనేమని జవాబివ్వనూ? మీ ఇద్దరి సాహచర్యం పధ్నాలుగేళ్ళే కాని, నిన్ను మోసి, కని, పంధొమ్మిదేళ్ళు నీ ఎదుగుదలని చూసిన నా కళ్ళు ఆ ప్రశ్నకి ఏం జవాబివ్వగలవు? లోక సహజంగా మా అపరంజి బొమ్మని మెచ్చిన వరుడికి ఇచ్చి పెళ్ళి చేశానేగాని నువ్వు వెళ్ళిపోతే ఏర్పడే ఆ వాక్యూమ్ గూర్చి ఆలోచించనే లేదు. అది మరీ ఇంత బాధాకరంగా వుంటుందని నేననుకోలేదు సుమా!

ఇరవయి ఏళ్ళ క్రితం నేనీ ఇంట్లోకి ఎలా అడుగు పెట్టానో నాకు తెలియదు. బహుశా అప్పుడు మా అమ్మ కూడా ఇలానే బాధపడి వుంటుందేమోనని ఇప్పుడనిపిస్తుంది నాకు. ఎంత త్వరగా గడిచిపోయాయి రోజులు? "స్కూల్లో ప్రతి ఏడూ నాటకాలలో నేనేనా భరతమాతనీ ?" (నీ జుట్టు పెద్దది అవడంవలన మీ ప్రిన్సిపాల్ నిన్ను తప్ప ఎవర్నీ సెలెక్ట్ చేసేది కాదు) అంటూ మూతి బిగించుకొని కోపంగా అడిగే చిన్నపాప, ఇంకొన్నాళ్ళకి "ఎందుకు మా వెల్లిని కొట్టారూ?" అంటూ తన వెల్లికి రక్షణ నిచ్చే అక్క, మరికొన్నాళ్ళకి "మమ్మీ జస్ ఏర్ చదివావా? ఎంతో బాగుంది కదూ? మా కాలేజీ లైబ్రరీ నుంచి తెస్తానుండు, మళ్ళీ చదువు" అనే యువతి — ఎంత పెద్దదయి పోయింది? ఇటువంటి దిగులు నా వక్కతిదేనా? నాలాంటి తల్లులు ఎవరయినా వుంటారా? "నువ్వుత్త సెంటిమెంటల్ ఫూల్వి!" అంటారు పప్పా. నిజమా? నేనుత్త సెంటిమెంటల్ ఫూల్ నేనా? ఈ న్యూక్లియర్ ఫామిలీలలో ఇటువంటివి తప్పవేమో! ఆలోచిస్తుంటే పూర్వం రోజులలో గంపెడు పిల్లల్ని కనమని ఎందుకు దీవించేవారో ఇప్పుడర్థం అవుతుంది. వచ్చేపోయే అతిథులకి వండి, వడ్డించి, మడి, తడీ, మళ్ళీ పిల్లల పెంపకం - ఇక ఆ తల్లికి ఆలోచించడానికి వ్యవధేదీ? ఒక పిల్ల పెళ్ళికాగానే, మరో పిల్ల పెళ్ళికి వెదుకులాట! అలా ఆ సంసార చక్రం తిరిగిపోయేది. కాని, ఇప్పుడో? కొంచెం నాకు తలనొప్పి అంటే చాలూ నువ్వు చేసే హడావిడి, పనిమనిషి ఏరోజయినారాకపోతే నువ్వెందుకు అన్ని పనులు చేస్తావు, నేను లేనా'! అంటూ పోట్లాడే నువ్వు, ఎంత ఆలస్యమయినా నేను బయటకి వెళ్తే తిరిగి వచ్చేవరకు కనీసం భోజనం అయినా చెయ్యకుండా అలా నా కోసం ఎదురుచూసే నువ్వు, ఏ క్షణం నాకు గుర్తు రావడం లేదని చెప్పేది తల్లీ?

"నేను వెళ్ళిన తర్వాత కొత్త పుస్తకాలు ఏం చదివావు?" అంటూ రాశావు. నీ ఆలోచనలని మర్చిపోవడానికి ఇల్లు సర్దుతుంటే పాత పుస్తకాలలోంచి నాకిష్టమయిన మాలతీచందూర్ నవల 'రాగరక్తిమ' కనిపించింది. నువ్వూ చదివావు కదా? పిల్లలు లేకపోయినా వసంతని పరిపూర్ణవ్యక్తిత్వం గలిగిన యువతిగా పెంచి పెద్ద చేసిన అనసూయ ఎంత గొప్పది? ఏమిటో ఎన్నిసార్లు చదివినా ఆ పుస్తకం నా కెప్పుడూ కొత్తదిగానే వుంటుంది. వయసు పెరుగుతున్న కొద్దీ, మళ్ళీ మళ్ళీ చదివిన కొద్దీ ఏదో కొత్త సత్యం తెలుసుకున్నట్లు వుంటాయి కొన్ని పుస్తకాలు. పిల్లల మనస్తత్వం, వాళ్ళని పెంచే విధానం నా మటుకు నాకు చాలా వరకు

జి.విద్యారాజేశ్వర్రావ్, సికింద్రాబాద్

ఆ పుస్తకం చదివిన తర్వాతే అర్థమయిందేమో అనిపిస్తుంది. ఎదిగే పిల్లల మనస్సుని అర్థంచేసుకొని వాళ్ళని ఒక స్నేహితులుగా తల్లి, తండ్రి గౌరవించిన రోజున ఇన్ని యాక్సిడెంట్స్, ఇంట్లోంచి పారిపోవడం, దుర్వ్యసనాల పాలవడం వుండదేమో!

ఇంకేం రాయనూ? ఎంత రాసినా, ఎన్ని పేజీలు రాసినా నీవు లేని ఈ వాక్యూమ్ ఎవ్వరూ పరిచేయలేరు. తప్పదు. వీటికి నేను క్రమంగా అలవాటు పడాలేమో! కొన్నిటికి కాలమే మందంటారు. అందుకే ప్రస్తుతం నెలే గడిచింది కాని, ఆ నెలే, అలా అలా నెలలుగా మారిపోతుంది.

నీ కొత్త కాపురం కలకాలం సుఖంగా సాగాలని, నీ అత్తమామలకి నచ్చే కోడలిగా, నీ భర్తని మెప్పించే భార్యగా, నీ వ్యక్తిత్వాన్ని నువ్వు నిలుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకునే,

—అమ్మ

కాలవ్ దాటని కథ

ఉదయం పది గంటలు. కాలేజీ వాతావరణం హడావిడిగా, సందడిగా వుంది. బి.ఎ. వాళ్ళకి ఆ రోజు ఫస్టవరు ఎకనామిక్స్. ఎకనామిక్స్ లెక్చరర్ రామనాథం గారంటే అమ్మాయిలందరు కొద్దిగా బోర్ ఫీలయ్యేవాళ్ళు. కారణం ఆయనకు కొంచెం చాదస్తపు మనస్తత్వం వుండటమే కాకుండా తాను చాలా గొప్పవాడినన్న అహంకారం ఆయనమాటల్లో తరచుగా వినిపిస్తూంటుంది.

ఆ రోజు ఎకనామిక్స్ క్లాసు తీసుకుంటూ "రికార్డియన్ థియరీ" గురించి చెప్పనుపక్రమిం

పాపం మాస్టారు!

చారు రామనాథం మాస్టారు." ప్రపంచంలో చాల మంది మేధావులుంటారు. వాళ్ళు ఎంత మేధావులయినప్పటికి విమర్శలకి గురికాక తప్పదు. రికార్డియన్ గొప్ప మేధావి. అయినా అతని మీద విమర్శలున్నాయి. అలానే షేక్స్పియర్ గొప్పకవి. కాని ఆయన మీద విమర్శలున్నాయి. అంత మాత్రం

చేత వాళ్ళు గొప్పవాళ్ళు కాక పోయారా. ఇప్పుడు నేనున్నాను. నేను ఎంత ఎమ్.ఎ. చదివి విజ్ఞానం సంపాదించి మీకు లెక్చరర్ నయినప్పటికీ మీలో చాలా మంది నామీద విమర్శలు విసురుతుంటారు. అంత మాత్రం చేత నేను గొప్ప లెక్చరర్ని కాక పోతానా" అని ఒకసారి క్లాసంతా కలియచూసి అంతలో ఒక అమ్మాయి ఏదో ఆలోచనలో నిమగ్నమైనట్లు గమనించి "ఏం సరోజా ఏమిటి ఆలోచిస్తున్నావ్? నేనన్నది నిజమేనా" అని ప్రశ్నించారు.

వెంటనే సరోజ "అవునా కాదా అని ఆలోచిస్తున్నాను మాస్టారూ." తకీమని జవాబిచ్చి ఊరుకుంది. అంతే క్లాసంతా గొల్లున నవ్వులతో మారుమ్రోగింది.

—జె. నిర్మల